గాన మూర్తి - ఆది

చేకొంటి నిహమే - చేరిన వరమని
గైకొని నీవిందు - గలవే గాన

జగమున గలిగిన - సకల భోగములు
తగిన నీప్రసా - దము లేయివి
అగపడు నేబది - యక్షర పంక్తులు
నిగమ గోచరపు - నీ మంత్రములే

పొదిగొని సంసార - పుత్ర దారలిల
వదలని నీదాస - వర్గములే
చెదరక యే పొద్దు - జేయునాపనులు
కదిసి నియ్యాజ్ఞా - కైంకర్యములే

నలుగడ మించిన - నాజన్మాదులు
పలుమరులిటు నీ - పంపులివి
యెలమిని శ్రీవేంక - టేశ్వర నీవిక
వలసినప్పుడీ - వరములు నాకు

శ్రీవేంకటేశ్వర చరణకమల సమర్పిత హృత్కమలుడైన అన్నమాచార్యులు తన సర్వస్వమూ తననూ, తనవారినీ, తన భోగభావాలన్నిటినీ శ్రీస్వామికి కైంకర్యం చేసి 32 వేల సంకీర్తనలను సరస రసామ్నాయంగా సంతరించి, స్వామికి సమర్పించి ఆయనకే శరణుజొచ్చి సాకల్యమైన శరణాగతి చేసిన వైఖరి ఈ సంకీర్తనంలో కన్పడుతున్నది.

నీవు ఇహంలోకూడా ఉన్నావుగదా అని ఇదే పరమూ, పరమార్ధ సాధనమూ అని స్వీకరించాను. ఈ జగత్తులో నాకు గలిగిన సకల భోగములూ నీ వరప్రసాదాలే. నాకు గోచరించే ఈ 56 అక్షర వర్ణక్రమాలూ వేదాలలో దర్శనమిచ్చే నీ మంత్రాలే నా సంసారిక జీవనంలో గల్గిన భార్యలు. సంతానం - అంతా నీ దాస దాసీజనమే. నేనపుడు ఏమి ఒనర్చినా ఆయా కర్మలన్నీ నీ ఆజ్ఞమేరకు (నన్ను సృజించినది, పెంచినది, కరుణించిగాచినది నీవేగనుక) నీకు కైంకర్యమైనవే (యద్యత్కర్మకరోమితత్తదఖిలం శంభోతవారాధనం అన్న శంకరుల మాట పునరుద్ఘాటితమైంది) నేనెత్తిన ఈ జన్మ నీ సంకల్పమే (నాచే సంకీర్తనలు ఒనరించు కొందామనీ, నా పదకవితా, గానమూ విందామనీ నీవే యివన్నీ

ఏర్పరచావు. నాది అంటూ ఏముంది?౹కర్త-కర్మ- క్రియా అన్నీ నీవే నేను చేసినదేమిటి ? నాకేమీ అక్కరలేదు. నీవేనేనైప్పుడు నాకేమి యిక - నాకు అవసరమైనప్పుడు శ్రీవేంకటే శ్వరా అవసరమైన వరములిద్దుగాని అన్న అన్నమాచార్యుల ప్రౌఢమైన శరణాగతిని చూస్తే కవిబ్రహ్మ తిక్కనగారు 15 పర్వాల మహాభారతమూ పూర్తిచేసి

పరమపదాప్తి హేతువగు భారత సంహిత శౌనకాదిభూ
సురువరు లింపునన్ గరగు చొప్పున జెప్పిన, వారుమోదసం
భరిత తబొంది యక్కధకు బ్రాతిగనర్చితుజేసిరెమ్మెయిన్
హరిహరనాథ సర్వభువనార్చిత నన్దయ జూడుమెప్పుడున్

అన్న పద్యం స్ఫురిస్తుంది. నిత్యమూ నన్ను దయజూడు మన్నారు కవి బ్రహ్మ దయతో ఆద రిస్తూనే ఉన్నావు అన్నారు పదకవితాబ్రహ్మ వారు ఇద్దరూ కూడా వారికేమి వరాలు కావా లో చెప్పలేదు ఎందువల్ల ? కవిబ్రహ్మ సోమయాజులూ, పదకవితాబ్రహ్మ అన్నమాచార్యు లూ ఉభయులూ సిద్ధ పురుషులు, పరిపూర్ణులు. నిష్కామధన్యులు అని ఘంటాపథంగా చాటి చెప్పవచ్చు.